ప్రజాశక్తి

మంగళవారం 19 ఆగస్టు 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వర్ష బీభత్సం

- విశాఖలో పలు కాలనీల్లోకి మురుగునీరు
- విరిగిపడ్డ కొండచరియలు
- అనకాపల్లి జిల్లాలో పంట పొలాల మునక
- నిండుతున్న జలాశయాలు



ఆరిలోవ కొండవాలు ప్రాంతంలో కూలిన ప్రహరీ



దేవరాపల్లిలో నీట మునిగిన వరి పంట

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, విలేకరులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో విశాఖ, అనకాపల్లి జిల్లాలను వర్షం ముం చెత్తింది. పలు కాలనీల్లోని ఇళ్లలోకి భారీగా నీరు చేరింది. విశాఖలోని కొండవాలు ప్రాంతాల్లో ఇళ్ల ప్రహరీలు కూలాయి. కొండ చరియలు విరిగిపడ్డాయి. అనకాపల్లి జిల్లాలో పంట పొలాలు నీట మునిగాయి. జలాశయాల్లోకి నీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది.

సోమవారం కురిసిన వర్షానికి విశాఖ నగరంలోని రోడ్లన్నీ జలమయ మయ్యాయి. అత్యధికంగా సీతమ్మధార ప్రాంతంలో 31.0, పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో 28.5 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. గెడ్డలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలైన కెఆర్ఎం కాలనీ, సైమన్ నగర్, ఆరిలోవ కాలనీలు, మాధవధార దిగువ ప్రాంతం, రైల్వే స్టేషన్ ఏరియా, చినవాల్తేరు ఫిష్ మార్కెట్ ఏరియాల్లోని ఇళ్లలోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరింది. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను అప్రమత్తం చేశారు. రాగల 12 గంటల్లో తీరం వెంబడి 40 కిలోమీటర్ల వేగంతో మిగతా 2లో..

వన్ టౌన్‌లో కాల్పుల కలకలం

ఒకరికి తీవ్ర గాయాలు - ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ వన్ టౌన్‌లో కాల్పుల కలకలం రేగింది. 39వ వార్డు చిలకపేటలో ఆదివారం అర్ధరాత్రి చేపల రాజేష్‌పై అదే ప్రాంతానికి చెందిన దూర నూకరాజు తన వద్ద ఉన్న తుపాకీతో పొట్టపై కాల్చాడు. ఆ సమయంలో నూకరాజు స్నేహితుడు దిలీప్, మరో ఇద్దరు అక్కడ ఉన్నారు. ఈ కేసులో సోమవారం సాయంత్రానికి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజేష్‌ను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ సంఘటన మిగతా 2లో..



హెలీ మ్యూజియం ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు డోలా, అనిత తదితరులు

హెలీ మ్యూజియం ప్రారంభం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



విశాఖ నగర వీధుల్లోకి చేరిన నీరు

వర్ష బీభత్సం



వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సుధాకర్ పర్యటన

గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నంలోపే ఒడిశా, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య అల్పపీడనం తీరం దాటే అవకాశాలున్నాయి.

అనకాపల్లి జిల్లాలో భారీ వర్షాల కారణంగా బుచ్చయ్యపేట, వడ్డాది తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లోకి భారీగా నీరు చేరింది. తాచేరు నది సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. బుచ్చయ్యపేట కెబి రోడ్డు, వడ్డాది జంక్షన్ ఫిష్ మార్కెట్, మసీదు, చోడవరం రోడ్లు జలమయమయ్యాయి. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పలు ప్రాంతాల్లో పర్యటించారు.

విశాఖ కలెక్టరేట్ : నగరంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గెడ్డలు, కాలువలు పొంగి పొర్లకుండా అడ్డంకులు ఉన్నచోట్ల పూడికతీత పనులు నిరంతరం చేపట్టాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జివిఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన 5వ జోన్ జ్ఞానాపురం ఎర్రిగెడ్డలోని పూడికతీత పనులను జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 29, 30, 36, 37 వార్డుల నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు ఎస్ఎల్ కెనాల్ ద్వారా ప్రవహించాల్సి ఉండగా ఆ కెనాల్లో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలువ ఉండిపోతోంది. ఈ సమస్యలన్నీ తెలుసుకున్న ఎన్‌టిఆర్ వైద్య సేవ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ సోమవారం వర్షంలోనే లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన వెంట 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, టిడిపి వార్డు అధ్యక్షులు బుచ్చి రాముర్రెడ్డి, కార్యదర్శి మంగరాజు ఉన్నారు.

వన్ టౌన్‌లో కాల్పుల కలకలం

జరగడానికి ముందు చిలకపేట అర్పి దగ్గర రాజేష్, నూకరాజు మద్యం సేవించి గొడవపడ్డారు. ఆ సమయంలో నూకరాజు కత్తితో రాజేష్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో రాజేష్ కత్తి లాక్కున్నాడు. తర్వాత ఇద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో మళ్లీ అదే ప్రాంతానికి వచ్చి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈసారి నూకరాజుతో పాటు అతని స్నేహితుడు దిలీప్, రాజేష్‌తో పాటు అతని స్నేహితుడు వాసుపల్లి నరేష్ ఉన్నారు. గొడవ తీవ్రం కావడంతో నూకరాజు తన వద్ద ఉన్న తుపాకీతో రాజేష్‌పై కాల్పులు జరిపాడు. అనంతరం నూకరాజు, దిలీప్ అక్కడ నుంచి పారిపోయారు. గాయపడ్డ రాజేష్‌ను కెజిహెచ్‌కు నరేష్ తదితరులు తీసుకువెళ్లారు. ఈ సంఘటన వెనుక రిటైర్డ్ కానిస్టేబుల్ నాయుడు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. నాయుడు అప్పట్లో కానిస్టేబుల్‌గా ఉండి విధులకు సక్రమంగా హాజరుకాకుండా పోర్టులో లారీలు పెట్టి బొగ్గు వ్యాపారం చేసేవాడు. డబ్బులు బాగా గడించాడు. పోలీసు ఉద్యోగం కంటే అదే బాగుందని భావించి ఆ వ్యాపారంలో కొంతమందిని చేర్చుకున్నాడు. వారంతా ఒక ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది. అయితే ఈ ముఠా కొన్ని ఆగడాలకు, అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి రాజేష్ ప్రశ్నించేవాడని పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నూకరాజు, దిలీప్‌లను పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనలో వెనకుండి నడిపించిన ప్రధాన నిందితుడు, రిటైర్డ్ కానిస్టేబుల్ నాయుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

నవంబర్ 30న వైజాగ్ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 30న సంధ్యా మెరైన్ వైజాగ్ మారథాన్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ మారథాన్ 4వ ఎడిషన్ రిజిస్ట్రేషన్లను విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి సోమవారం ప్రారంభించారు. స్థానిక నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఉత్తమ ఆహార అలవాట్ల ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. బీచ్ రోడ్డులో జాగింగ్ ట్రాక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ ఈ పోటీల్లో అన్ని వయసుల వారూ పాల్గొనే విధంగా 32కె, 21కె, 10కె, 5కె విభాగాల్లో మారథాన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు http://www.vizagmarathon.runలో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మారథాన్‌లో పాల్గొనేవారికి ప్యూమ రేస్ టీ షర్ట్, మెడల్, రేస్ ఫోటోగ్రాఫ్స్, ఎనర్జీ డ్రింక్, అల్పాహారంతో పాటు విజేతలకు రూ.10 లక్షల విలువగల బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రేస్ పోస్టర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ డైరెక్టర్ ఆనంద్, మెడికల్ పార్ట్‌నర్ అపోలో హాస్పిటల్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కృష్ణ ప్రసాద్, వరుణ్ గ్రూప్ అధినేత ప్రభు కిషోర్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఉన్నత ప్రమాణాలు

సాంఘిక సంక్షేమ శాఖ ప్రాంతీయ సదస్సులో మంత్రి డోలా



మాట్లాడుతున్న మంత్రి డోలా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చేరుతున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం, విద్య అందించాలని, వసతి గృహాల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు అందరూ కృషిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. నగరంలోని రుషికొండలో వున్న గీతం విశ్వవిద్యాలయంలోని మదర్ థెరిసా ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రాంతీయ సదస్సు సోమవారం జరిగింది. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు, సంక్షేమ అధికారులు, సహాయ సంక్షేమాధికారులు, హాస్టళ్ల సంక్షేమాధికారులు 230 మంది పాల్గొన్నారు. హాస్టళ్లలో సీట్ల భర్తీ, ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో విద్యార్థుల ఉత్తీర్ణత, హాస్టల్ భవనాల మరమ్మతులు, డైట్ బిల్లుల చెల్లింపు, పారిశుధ్య నిర్వహణ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజన వసతి కల్పించడం, హాస్టళ్ల తనిఖీలు తదితర అంశాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ డైరెక్టర్ లావణ్యవేణి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం.నాయక్‌లతో కలిసి మంత్రి జిల్లాల వారీగా, అంశాల వారీగా సమీక్షించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లోని విద్యార్థులకు వార్డెన్‌లే గార్డియన్లుగా వ్యవహరించి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి గత ఏడాది నీట్‌లో కొద్దిపాటి ర్యాంకు తేడాతో సీట్లు పొందలేకపోయిన ఎస్‌సి విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. హాస్టళ్లలో వంద శాతం ప్రవేశాలు జరిగి సీట్లన్నీ భర్తీ కావాలన్నారు.

తుంగభద్ర వారియర్స్ విజయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిఎల్ సీజన్ - 4లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన 18వ మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ విజయవాడ సన్ షైనర్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ సన్ షైనర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేయగా దాన్ని తుంగభద్ర వారియర్స్ 19 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది.

ఆ జట్టులో కె.ఆనంద్ జోషయ్య 16 బంతులలో 5 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 42 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ కెఎం.కుమార్ 40 బంతుల్లో ఒక సిక్స్, రెండు ఫోర్లతో 36 పరుగులు సాధించాడు. ఆనంద్ జోషయ్యకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

పిజిఆర్ఎస్‌కు 173 వినతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 173 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 66 ఉండగా పోలీసు శాఖకు సంబంధించి 10, జివిఎంసికి సంబంధించి 50 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 47 వినతులు వచ్చాయి. అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.

హెలీ మ్యూజియం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, నగరంలో ఆకర్షణీయమైన ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత అన్నారు. బీచ్ రోడ్డులో ఇండియన్ నేవీ సహకారంతో సుమారు రూ.3.50 కోట్ల నిధులతో నెలకొల్పిన యుహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని సోమవారం సాయంత్రం వారు ప్రారంభించారు. అనంతరం డోలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అతి త్వరలోనే దేశంలోని అతి పెద్ద గ్లాస్ బ్రిడ్జిను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

కైలాసగిరిపై త్రిశూలం, డమరుకం నిర్మాణానికి భూమి పూజ

కైలాసగిరిపై రూ.కోటీ 55 లక్షల వ్యయంతో 55 అడుగుల ఎత్తులో నిర్మించనున్న త్రిశూలం, డమరుకం నిర్మాణాలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి అనిత భూమి పూజ చేశారు.

సిలిండర్ పేలుడు ఘటనలో మరో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బుక్కా వీధిలో ఈ నెల 7వ తేదీన జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు సంఘటనలో మరొక వ్యక్తి సోమవారం మరణించారు. మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టి.సన్యాసిరావు (52) మరణించాడని వన్ టౌన్ పోలీసులు తెలిపారు. దీంతో ఈ సంఘటనలో మృతి చెందిన వారి సంఖ్య ఆరుకు చేరింది. సంఘటన జరిగిన రోజున ముగ్గురు చనిపోగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురూ మరణించారు.

రూ.38 కోట్లతో జిల్లా గ్రంథాలయ భవనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలంలో పారామెట్రిక్ డిజైన్‌తో రూ.37.95 కోట్లతో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం నిర్మాణానికి ఆమోదం కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపాలని సోమవారం జరిగిన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ మేరకు ఇచ్చిన ఎస్టిమేషన్లపై సమావేశంలో ముందుగా చర్చించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో వివిధ శాఖా గ్రంథాలయాలకు రూ.6 లక్షలతో ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు నిమిత్తం పరిపాలనా ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపేందుకు చేసిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. పరవాడ మండలం వాడచీపురుపల్లిలో శాఖా గ్రంథాలయానికి నూతన భవనం నిర్మాణం కోసం రూ.25.లక్షలతో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులు ఇచ్చిన ఎస్టిమేషన్స్‌పై చర్చించి తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో విద్యాశాఖ ఎడి.గోపి కృష్ణ, వయోజన విద్య ఉపసంచాలకులు ఎస్.సుబ్రహ్మణ్యవర్మ, జిల్లా పంచాయతీ శాఖ ఎఒ బివికె.సత్యనారాయణ పాల్గొన్నారు.

జడివానతో జనం అవస్థలు

• రహదారులు, కాలనీల్లోకి భారీగా వర్షపునీరు • నీట మునిగిన పంటపొలాలు



ఆనందపురంలో రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న వర్షపునీరు

ప్రజాశక్తి- ఆనందపురం :ఎడతెరిపి లేని వర్షాలకు పంటపొలాలు, రహదారులు నీటముంపు బారిన పడ్డాయి. రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి నారు, ఆకుకూరలు, కూరగాయలు, పువ్వుల తోటలు నీటమునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు పంచాయతీలలో గెడ్డలు కబ్జా చేయడంతో వర్షపు నీరు చెరువుల్లోకి చేరక రహదారులపై నిలిచిపోతోంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం వద్ద 300 మీటర్ల మేరకు సర్వీస్ రోడ్డు, హైవే, డివైడర్లు నీటమునిగాయి. మూడు అడుగుల మేర వర్షపు నీరు నిలిచి రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. వెల్లంకి , పెద్దిపాలెం, దుక్కువానిపాలెం, శొంఠ్యాం గ్రామాల వద్ద కూడా రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో జనజీవనం స్తంభించింది.

శొంఠ్యాం పంచాయతీ ఆబోతువానిపాలేనికి అనుసంధానంగా ఉన్న రహదారి, స్థానిక గెడ్డ నుంచి పొంగి వచ్చిన వరద నీటికి కొట్టుకుపోయింది. రెండేళ్ల క్రితం ఇదే గెడ్డ పొంగి ఒక బాలుడు మృతి చెందిన ఘటన గుర్తు చేసుకుంటూ, మళ్లీ అలాంటి పరిస్థితులు తలెత్తుతాయేమోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.కణమాం పంచాయతీ గ్రామాలకు, ఆబోతువానిపాలేనికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.ముచ్చర్ల చెరువు పూడుకుపోయి, కొండలపై వచ్చిన నీటితోపాటు, బాకురుపాలెం గోపరాజు చెరువు పొంగి నీలకుండీలు, పద్మనాభం రహదారి, బాకురుపాలెం జైంక్షన్ వద్ద రహదారిపై నీరు చేరింది. ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహన రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి.

ముంపును పరిశీలించిన అధికారులు

బాకురుపాలెం గోపరాజు చెరువు పొంగిపడడంతో వర్షపు నీరు పొలాల్లోకి, రహదారులపైకి చేరింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీనుబాబు, డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, విఆర్‌ఒ రమేష్ అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.చెరువుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీరు రహదారులపైకి రాకుండా చేశారు. తర్లువాడ, యాతపేట గ్రామాల్లో కాలువలు పూడిపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది.తర్లువాడలో వ్యాపారవేత్త బాలి అప్పలరాజు (బంకు రాజు) స్వచ్ఛందంగా జెసిబి సమకూర్చి, నీటిముంపు తొలగించే చర్యలు చేపట్టారు.

లేఅవుట్ ప్రహరీతో వరి పొలాల ముంపు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బిబిజి టూర్ క్యాపిటల్ లేఅవుట్ ప్రహరీ దెబ్బకు ముంపునకు గురైన 50 ఎకరాల వరిపైర్లను సోమవారం మండల ప్రత్యేక అధికారిని జ్ఞానవేణి పరిశీలించారు పాండ్రంగి నుంచి తగరపువలస వెళ్లే మార్గంలో పక్కారోడ్డును ఆనుకుని 12ఎకరాల్లో ఏర్పాటుచేసిన లేఅవుట్‌కు నిర్మించిన ప్రహరీ వల్ల ఇటీవల మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు ఎగపోటు కట్టి భారీగా నిలిచిపోయింది. దీంతో వీటిని ఆనుకుని ఉన్న వరి పొలాలన్నీ ముంపుబారిన పడ్డాయి.

ముంపు నీరు మళ్లింపునకు చర్యలు

ముంపు బారిన పడ్డవరి పొలాలను స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు, వ్యవసాయాధికారి ఎం.వెంకటాచలం, ఎంపిడిఒ ఎం.విజయకుమార్‌లతో కలిసి పరిశీలించిన మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి, లేఅవుట్ ముందుభాగంలో జెసిబితో కాలువ తవ్వించి, ముంపునీరు మళ్లింపునకు చర్యలు స్వయంగా చేపట్టారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా . లేఅవుట్ అనుమతులపై స్థానిక గ్రామకార్యదర్శితో మాట్లాడారు. గ్రామపంచాయతీ అనుమతి పొందినట్లు గుర్తించారు.



పద్మనాభంలో నీట మునిగిన పంటపొలాలు

సీతమ్మధార : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి శంకరమఠం రోడ్ నుంచి రామలింగేశ్వర గుడి వరకు రహదారిపై భారీగా నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నీట మునిగిన పాలవలస

గాజువాక.: హిందూజా పవర్ ప్లాంట్ రైల్వే ట్రాక్ కోసం గోతులు తవ్వడం, గ్రామానికి సంబంధించి సరైన అవుట్లెట్ లేకపోవడం వల్ల వర్షపు నీరు అంతా గ్రామంలో నిల్వ ఏర్పడి ఉండడంతో పాలవలస గ్రామం మునిగింది. ప్రొక్లెయినర్‌తో నీరు మళ్లింపు చర్యలు చేపట్టినప్పటికీ, దిగువకు సాఫీగానీరు వెళ్లే వీలు లేక నెమ్మదిగా నీరు వెళుతోంది.



గాజువాక : పాలవలసలో ఇళ్లల్లోకి చొరబడిన నీరు

కూలిన చెట్టు పరిరక్షణకు చర్యలు

సీతమ్మధార : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జివిఎంసి 26వ వార్డు హైవే సర్వీస్ రోడ్డు, సత్యసాయి మందిరం లైన్‌లో సోమవారం భారీ చెట్టు కూలిపోయింది. విద్యుత్ వైర్లతోపాటు ఒక ఇంటిపై అడ్డంగా పడడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. స్థానికుడు రామారావు అందించిన సమాచారం మేరకు జివిఎంసి హార్టీకల్చర్ విభాగం ఎఇఇ వెంకటరమణ సంఘటనాస్థలికి సిబ్బందిని పంపించారు. అయితే భారీ చెట్టును రక్షించాలన్న సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీ లావణ్య సలహా మేరకు ఎంఎహెచ్‌ఒ ప్రసాద్ ఫోన్ చేసి జెసిబిని రప్పించి, కూలిన చెట్టును వేళ్లతో సహా పక్కన ఉంచారు. చెట్టు కొమ్మలు మాత్రమే తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షాలు తగ్గిన తర్వాత చెట్టును యథాస్థానంలో నిలబెట్టే చర్యలు చేపడతామని స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షుడు ముక్క కిషోర్ కుమార్, జివిఎంసిఅధికారులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో పడిన బండరాళ్లు

ములగాడ : విస్తారంగా కురుస్తున్న వర్షాలకు సింధియా, గాంధీ గ్రామ్, యారాడ ఘాట్‌రోడ్డు, రెండో మలుపులో కొండచరియలు, బండరాళ్లు విరిగిపడి రోడ్డుపైకొచ్చాయి. ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో పెద్దప్రమాదమే తప్పింది.

భీమునిపట్నం : తుపాను ప్రభావిత నాల్గో వార్డు బీచ్ రోడ్డులో ఉన్న మంగమారి పేటను తహశీల్దార్ పైలా రామారావుతో కలిసి స్థానిక ఆర్‌డిఒ సంగీత్ మాధుర్‌పర్యటించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడం, ముందుకు రావడంతో అక్కడున్న కుటుంబాలను అప్రమత్తం చేశారు.మత్స్యకారు లెవ్వరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.తుపాను రక్షిత భవనాన్ని పరిశీలించారు.మూడో వార్డు బోయి వీధికి ఆనుకుని సముద్రం ముందుకు వచ్చింది. తీరం వద్ద రక్షణ గోడ నిర్మించాలన్న ఏళ్లనాటి మత్స్యకారుల మొర నేటికీ కార్యరూపం దాల్చలేదు.

వర్షప్రభావిత ప్రాంతాల్లో నేతలు, అధికారుల పర్యటన



తుఫాన్ ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న మేయర్ పీలా

ఆరిలోవ : ఎడతెరిపి లేని వర్షాలకు ప్రభావితమైన కొండవాలు ప్రాంతాలను, ముంపు కాలనీలను మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం పర్యటించారు. పెదగదిలి కొండవాలు ప్రాంతంలో కుప్పకూలిన రక్షణ గోడను పరిశీలించారు. 13వ వార్డు రామకృష్ణాపురంలో పడిపోయిన ఇంటి గోడను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, జెడ్పీ కనకమహల్మక్ష్మితో కలిసి చూశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, గెడ్డల్లో పూడికలను తొలగించాలని అధికారులకు సూచించారు. రామకృష్ణాపురం కాలనీ అధ్యక్షులు వంకర బాబూరావు, కాకర గోవిందు, టిడిపి నాయకులు జి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, ఎం.జక్కన్న పాల్గొన్నారు.

గోపాలపట్నం :కొండవాలు ప్రాంతాలైన లక్ష్మీ నగర్ , ఈ-బ్లాక్, ఎఫ్-బ్లాక్, 57వార్డ్ శ్యామ్ నగర్ కాలనీ, 56వ వార్డు చాకలి గడ్డ ప్రాంతాల్లో అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే పెతకం శెట్టి గణబాబు పర్యటించారు. ఇటీవల నిర్మించిన రిటర్నింగ్ వాల్‌ను పరిశీలించారు. వర్షాల ప్రభావంతో కొండవాలులో నీరు ఉప్పొంగి, రోడ్లు, వీధుల్లోకి వచ్చిన సమాచారంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ -5 రాము, ఈ ఈ ప్రసన్న, 90 వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, 56వార్డ్ కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, నరిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్, నరవ అనూష, శరగడం అరుణ్‌కుమార్ పెంటకోట అజయ్, పెంటకోట రాజు, జీవ పాల్గొన్నారు.

కొత్తపాలెం శివారులో నరవ వెళ్లే ప్రధాన రహదారిలో వర్షాలతో కాలువల్లో నీటి ప్రవాహం అధికమై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను 89 వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ జివిఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రొక్లెయినర్‌తో పూడికలు తీయించి, ముంపు సమస్య తొలగించారు.

ములగాడ: జివిఎంసి 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీ, దుర్గా నగర్ కొండవాలు ప్రాంతాల్లో వార్డు అధ్యక్షుడు మజ్జి.మాలినాయుడు పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గెడ్డ షోలింగ్ పడిపోవడం, వీధిలైట్ల సమస్య, కరెంట్ స్తంభాలు షాక్‌కొట్టడం వంటి పలు సమస్యలు ఆయన దృష్టికి రాగా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వార్డు టిడిపి నాయకులు డొప్ప సన్యాసిరావు, నీలిమరాజు, ధర్మారావు, ఉన్నారు.



కొండవాలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

నేరాలు ఘోరాలు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- 24 తులాల బంగారం రికవరీ

ప్రజాశక్తి -గాజువాక.: స్టీల్ ప్లాంట్ డిజిఎం ఇంట్లో దొంగతనం కేసును అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో 24గంటల్లోనే పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు మాటూరి శ్రీనును అరెస్టు చేసి, దొంగిలించిన 24 తులాల బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గాజువాక పోలీస్ కాంప్లెక్స్‌లో విలేకరుల సమావేశంలో డిసిపి కె.లతామాధురి వివరాలను వెల్లడించారు.

ఈనెల 15న, స్టీల్‌ప్లాంట్, సెక్టార్ 6, క్వార్టర్ నెంబర్ 105/8లో నివాసముంటున్న హెచ్‌ఆర్ డిజిఎం నల్లి సుందరం ఇంట్లో చోరీ జరిగింది. మధ్యాహ్నం భార్యతో కలిసి ఫంక్షన్ వెళ్లి,తిరిగొచ్చేసరికి ఇంటి ప్రధాన ద్వారం, గ్రౌండ్‌ఫ్లోర్ డోర్ తాళాలు పగలగొట్టి, బీరువా లాకర్‌లోని24 తులాల బంగారు ఆభరణాలు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సాంకేతిక ఆధారాలను ఉపయోగించి, కేవలం 24 గంటల్లోనే అగనంపూడికి చెందిన నిందితుడు మాటూరి శ్రీనును పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి పది బంగారు గాజులు, నాలుగు బంగారు బ్రాస్లెట్స్, 23జతల బంగారు చెవిలీలు, ఒక బంగారు చైన్, నాలుగు జతల బంగారు చెవి దిద్దులు, ఆరు ఉంగరాలు, మూడు బంగారు లాకెట్, ఒక నల్లపూసల దండ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీకి ఉపయోగించిన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తప్పిన ప్రమాదం



రహదారి గోతిలో దిగబడ్డ లారీ

ప్రజాశక్తి- పెందుర్తి :జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్ మెయిన్ రోడ్‌లో సోమవారం భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. సుజాత నగర్ నుండి కార్మిక నగర్ వైపు వెళ్తున్న లారీ, సుజాతనగర్ ఆర్చ్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా లారీ వెనుకచక్రాలు గోతిలో దిగడంతో లారీ ముందుభాగం పైకిలేచి, పూర్తిగా పక్కకు ఒరిగింది. దగ్గర్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. రహదారుల్లో పైపులైన్ల ఏర్పాటు, మరమ్మతులకు ఎక్కడికక్కడే గోతులను తవ్వేసి, సరిగ్గా పూడ్చకుండా ఇష్టానుసారంగా వదిలేయడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణలోపం వల్ల పనుల్లో నాణ్యత కొరవడడం ప్రజల ప్రాణాల మీదకు వస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు మానుకోవాలి

ప్రజాశక్తి- తగరపువలస : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను వేగవంతం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్లాంట్‌లోని 32 విభాగాలను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు వచ్చేనెల 9నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు ప్రకటన విడుదల చేశారన్నారు. గడచిన ఎన్నికలకు ముందు ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకుంటామని ప్రజలను నమ్మబలికిన టిడిపి, జనసేన పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.17 వేల మంది రెగ్యులర్,వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు, పరోక్షంగా వేల కుటుంబాలకు జీవనోపాధినిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలను మానుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు

అర్జీలు నిల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు ఎటువంటి అర్జీలు అందలేదని జెడ్‌సి బమ్మి అయ్యప్ప నాయుడు తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు



మాట్లాడుతున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -తగరపువలస : ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ శంఖబ్రత బాగ్చీ సూచించారు. సోమవారం స్థానిక సంగివలస ఎన్నారై వైద్య కళాశాలలో ర్యాగింగ్‌ వ్యతిరేక వారోత్సవాల ముగింపు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ర్యాగింగ్‌ వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్ట రీత్యా తీసుకునే చర్యలను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు వివరించారు. కళాశాల డీన్‌ డాక్టర్‌ పివి సుధాకర్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్నారై వైద్య కళాశాల సిఇఒ డాక్టర్‌ చంద్రశేఖర్‌ రెడ్డి, పరిపాలనాధికారి శివ ప్రసాద్‌, నార్త్‌ పోలీస్‌ సబ్‌ డివిజన్‌ ఎసిపి, అప్పలరాజు, సిఐ, బి తిరుమల రావు, వివిధ విభాగాల అధిపతులు, సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు సిపి బహుమతులు అందజేశారు. అనంతరం పోలీస్‌ కమిషనర్‌ను సంస్థ డీన్‌, సిఇఒ ఘనంగా సత్కరించారు.

స్టీల్‌ప్లాంట్‌ ప్రయివేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దొంగాట



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్‌:ఎన్నో త్యాగాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తుంటే, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సహకరించడం ద్వారా దొంగాటాడడం దుర్మార్గమని సిఐటియు మద్దిలపాలెం జోన్‌ కార్యదర్శి పి. వెంకటరావు విమర్శించారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ ప్లాంట్‌ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్షలు 1603 వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్‌ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లోని విద్యుత్‌ కేంద్రంతో సహ అనేక విభాగాలకు టెండర్లు పిలవడం ద్వారా ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ప్యాకేజీ తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ ప్రయివేటీకరణకు అడ్డుకున్నామని కూటమి పాలకులు నేటికీ చెప్పడం సిగ్గుచేటన్నారు. తొలగించిన 4,500 మంది స్టీల్‌ కాంట్రాక్ట్‌ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ రంగంలో కొనసాగించడం ద్వారా స్టీల్‌ ప్లాంట్‌ పరిరక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం అధ్యక్షుడు డి.అప్పలరాజు, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి ఎ.నరేంద్ర కుమార్‌,ఆర్టీసీ నాయకులు ఎ.సీతాలక్ష్మి, సిఐటియు నాయకులు కె.కుమారి పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్‌ : హామీలిచ్చి అమలు చేయని చంద్రబాబు మోసాలపై క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి చైతన్యపరచాలని వైసిపిదక్షిణ ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్‌ కుమార్‌ పిలుపు ఇచ్చారు. సోమవారంఆశీలుమెట్ట కార్యాలయంలో దక్షిణ వైసిపి రథసారధులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో సమన్వయ కమిటీ సమావేశంనిర్వహించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం విజయవంతానికి సూచనలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా, పేద ప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. దానికోసం వైసిపి కుటుంబ సభ్యులందరూ కష్టపడాలని సూచించారు.వార్డు స్థాయి, బూత్‌ స్థాయిలలో కమిటీని వేసి ఈ నెల 31 లోగా దక్షిణ కార్యాలయంలో సమర్పిస్తే, వాటిని పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిస్తామని సూచించారు.

కేన్సర్‌పై మరిన్ని పరిశోధనలు

గీతం అంతర్జాతీయ సదస్సులో నిపుణులు



ఒరిగాన్‌ వర్శిటీ డైరెక్టర్‌ను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన స్కీమ్‌ ఫర్‌ ప్రమోషన్‌ అకడమిక్‌ అండ్‌ రీసెర్చి కొలాబరేషన్‌(స్పార్క్‌) ప్రాజెక్టులో భాగంగా గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌, అమెరికాలోని ఒరిగాన్‌ హెల్త్‌ అండ్‌ సైన్స్‌ యూనివర్సిటీ సంయుక్తంగా కేన్సర్‌ పరిశోధనలపై అంతర్జాతీయ సదస్సును సోమవారం నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ ఎస్‌.అనంత రామకృష్ణ మాట్లాడుతూ కేన్సర్‌ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళి రక్షణకు మరిన్ని పరిశోధనలు, అధ్యయనాలు అవసరమని, స్పార్క్‌ ప్రాజెక్టు ద్వారా గీతం, ఒరిగాన్‌ వర్సిటీలు కేన్సర్‌పై పరిశోధనలకు ఒకవేదికపైకి రావడం అభినందనీయమన్నారు. గీతంలోని కేన్సర్‌పై జరుగుతున్న పరిశోధనలు వివరించారు. ఒరిగాన్‌ హెల్త్‌ అండ్‌ సైన్స్‌ యూనివర్సిటీ కేన్సర్‌ బయాలజీ పరిశోధనా కేంద్రం డైరక్టర్‌ ప్రొఫెసర్‌ సంజయ్‌ మల్‌హోత్రా మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు కేన్సర్‌ వ్యాధి పెను సవాలుగా మారిందని, 2020లో రొమ్ము కేన్సర్‌తో ప్రపంచ వ్యాప్తంగా 6.8 లక్షల మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారన్నారు ఏటా 3.1 శాతం చొప్పున రొమ్ము కేన్సర్‌ కేసులు పెరుగుతున్నాయన్నారు. ప్రపంచంలో తొలిసారిగా టార్గెట్‌ థెరపి ద్వారా రొమ్ము కేన్సర్‌ చికిత్సకు మార్గాలను తమ పరిశోధన కేంద్రం గుర్తించిందన్నారు. కేన్సర్‌కు కారణాలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాలను ఆయన వివరించారు. గీతం స్పార్క్‌ ప్రాజెక్టు ప్రిన్సిపల్‌ ఇన్వెస్టిగేటర్‌ ప్రొఫెసర్‌ మళ్ళ రామారావు కేన్సర్‌ పరిశోధనల ప్రాధాన్యతను, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ కె.వేదవతి, జీవ శాస్త్రాల విభాగం అధిపతి ప్రొఫెసర్‌ ఎన్‌.శ్రీనివాస్‌, డాక్టర్‌ పి.వాసుదేవరాజు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన కేన్సర్‌ పరిశోధన నిపుణులు ప్రసంగించనున్నారు.

గీత కార్మికులకు బార్ల కేటాయింపు



డ్రా తీస్తున్న జిల్లా కలెక్టర్‌ హరేంధిర ప్రసాద్‌

ప్రజాశక్తి- కలెక్టరేట్‌ : రాష్ట్ర ప్రభుత్వ కొత్త బార్ల పాలసీలో భాగంగా నోటిఫై చేసిన నూతన బార్లను సోమవారం డ్రా ద్వారా జిల్లా కలెక్టరేట్‌లో కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు 10 శాతం బార్లను కేటాయించగా, ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్‌ ఆర్‌. ప్రసాద్‌, సిఐలు, ఎస్సైలు సమక్షంలో కలెక్టర్‌ హరేంధిరప్రసాద్‌ స్వయంగా డ్రా తీశారు. జివిఎంసి పరిధిలో పది బార్లకుగాను చెట్టి బలిజలకు ఆరు, యాత కులాలకు నాలుగు బార్లను కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన బార్ల లైసెన్స్‌ల గడువు ఈనెలాఖరుతో ముగియనుంది.కార్యక్రమంలో యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము, చెట్టి బలిజ వెల్ఫేర్‌ డెవలప్మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ అనుసూరి మధుసూదన రావు, గౌడ సంఘం నాయకులు కృష్ణ గౌడ్‌, యాత కార్పొరేషన్‌ మాజీ డైరెక్టర్‌ బాడితమాను రాములప్పుడు, యాత సంక్షేమ సేవా సంఘం కార్యదర్శి చిట్టిబోయిన రాము పాల్గొన్నారు.

ఘనంగా జీమా ద్వితీయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న జీమా సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ: గాజువాక మూవీ ఆర్టిస్ట్‌ అసోసియేషన్‌ (జీమా) ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు, జ్యోతిప్రజ్వలనతో వేడుకను ప్రారంభించిన సంస్థ అధ్యక్షుడు పైడిరాజు నూనెల మాట్లాడుతూ జీమాలో ప్రస్తుతం 150 మంది కళాకారులతోపాటు 24 క్రాఫ్ట్‌కు చెందిన డైరెక్టర్లు టెక్నీషియన్స్‌ సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడి సినిమాల చిత్రీకరణ జరిగినా స్థానిక కళాకారులకు అవకాశం కల్పించేందుకు జీమా చొరవ చూపుతోంద న్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, టెక్నీషియన్లను సత్కరించారు.

కార్యక్రమంలో సంస్థ వైస్‌ ప్రెసిడెంట్‌ బాల కుమార్‌, సెక్రెటరీ ఊకోటి వెంకటేశ్వర రావు నాని, జాయింట్‌ సెక్రెటరీ శరత్‌ కుమార్‌, కోశాధికారి కుమారి, కమిటీ సభ్యులు కె..మంగ, తిలక్‌ ప్రసాద్‌, మురళి, సోముదేవ్‌ గాంధీ, డైరెక్టర్లు నవీన్‌ తేజస్‌, అప్పారావు, కళాకారులు వెంకటరమణ, శరగడం మహేశ్వరరావు, బి.వరలక్ష్మి, అరుణ కుమారి, అప్పల రాజు, బాలు వర్మ, కిరణ్‌, పాల్గొన్నారు, అనంతరం విందు ఏర్పాటు చేశారు.

నేతాజీ, పాపన్నగౌడ్‌లకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న ఫౌండేషన్‌ సభ్యులు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం గ్రామం 24వ కాలనీలో జై జవాన్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శ్రీ సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ మహారాజ్‌ 375వ జయంతి, నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు, భీమిలి ఎంఎసి డైరెక్టర్‌ కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ మొఘల్‌ చక్రవర్తులను ఓడించి గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన ఘనత తొలి తెలుగు బహుజన చక్రవర్తి పాపన్న గౌడ్‌దేనన్నారు. తెలంగాణలో మాదిరిగా ఏపీలోనూ పాపన్నగౌడ్‌ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఫౌండేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ ముడసల శ్రీను మాట్లాడుతూ నేతాజీ సాయుధ పోరాట స్ఫూర్తిని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ జనరల్‌ సెక్రటరీ ఇమంది శ్రీనివాసరావు, సెక్రటరీ కార్తీక్‌, సభ్యులు అప్పారావు, శ్రీను, రాము, గణేష్‌, రాజు, మహిళలు నాగమణి, మారమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ దరఖాస్తుకు 20 వరకు గడువు

ప్రజాశక్తి-ఆనందపురం: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులై ఉండి ఆర్థికసాయం పొందని వారు ఈనెల 20లోగా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి సంధ్య రత్నప్రభ తెలిపారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. అర్హులైన రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టిపిఒగా ప్రమీల

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి మూడో జోన్‌ పట్టణ ప్రణాళిక విభాగంలో టిపిఒగా పి.ప్రమీల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన టిపిఒ వైఎస్‌.శ్రీలక్ష్మి రెండోజోన్‌కు బదిలీ చేశారు. నూతన టిపిఒ ప్రమీలను కార్యాలయ సిబ్బంది స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు బాండ్‌ అందజేస్తున్న ఆలయ అధికారి

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ప్రసాద పథకానికి నగరంలోని సీతమ్మధార ఆక్సిజన్‌ టవర్స్‌ నివాసితులు నర్సిపురం మాధవరావు, రాధారాణి దంపతులు రూ. 1,00,116 విరాళంగా అందజేశారు.విరాళాన్ని దేవస్థానం పిఆర్‌ఒ కార్యాలయంలోని విరాళాల కౌంటర్‌లో అందజేసి రశీదు పొందగా, ఆలయ సీనియర్‌ సహాయకులు సూర్యనారాయణ విరాళమొత్తానికి బాండ్‌ను అందజేశారు.అనంతరం దాతలకు స్వామి అంతరాలయ దర్శనం కల్పించారు. ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం, స్వామి ప్రసాదాలను అందజేశారు.

కాఫీ షాప్‌ ప్రారంభం



షాపును ప్రారంభిస్తున్న వెంకట్రావు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నీలకుండీలు జంక్షన్‌ వద్ద జంగాల హరిప్రసాద్‌, పైలా గౌతమ్‌ నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్‌ ఇండియా ఫిల్టర్‌ కాఫీ షాప్‌ను వైసిపి వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మజ్జి వెంకటరావు ప్రారంభించారు. యువత స్వయం ఉపాధికి ఇలా వ్యాపారాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్‌ బిఆర్‌బి. నాయుడు, బంకు రాజు, మాజీ ఎంపిటిసి రెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ పాలకమండలికి సత్కారం



త్రిసభ్య కమిటీని సత్కరిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని వేములవలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌ రౌతు నాగరాజును స్థానిక కూటమి నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. కొండ్రోతు రామారావు ఆధ్వర్యంలో పిఎసిఎస్‌ డైరెక్టర్‌ మీసాల రామునాయుడును సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్‌ పిన్నింటి సన్యాసిరావు, ఉప్పాడ కృష్ణ, మీసాల నాయుడు, కనకరాజు, కృష్ణ, గండ్రేటి వంశీ, దుర్గ పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

వర్షానికి రోడ్లు జలమయం



అనకాపల్లి మండలంలో నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి మండలంలో పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాలు చెరువులను తలపించేలా మారాయి. వేసిన కొద్దిపాటి పొలాల్లో వరి నారుమల్లు నీట మునిగాయి. ఎడతెరిపి లేని వర్షాలు వల్ల జనజీవనం స్తంభించింది. ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటికి రాని పరిస్థితి నెలకొంది. అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రోడ్డులో పలుచోట్ల వర్షపు నీరు భారీగా రోడ్డుపై నిలిచింది. ఇప్పటికే రోడ్లపై గుంతలు పడడంతో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నబాబు కాలనీలో ఇటీవల కొత్తగా రోడ్డు వేసిన భారీగా వర్షం నీరు చేరింది. మార్టూరు జంక్షన్, దర్జీ నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, పూల్ బాగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద భారీగా వర్షం నీరు చేరడంతో చెరువును తలపించేలా ఉండే నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరి నారుమల్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లావ్యాప్తంగా వర్షపాత నమోదు వివరాలు మండలాల వారి (మిల్లీమీటర్లలో) ఈ విధంగా ఉన్నాయి. అనకాపల్లి 122.2, కసింకోట 85, మునగపాక 91.4, అచ్యుతాపురం 110.8, సబ్బవరం 135.4, దేవరపల్లి 149.2, కె. కోటపాడు, మాడుగుల 150.2, చీడికాడ 155.6, చోడవరం 141, రావికమతం 134.2, రోలుగుంట 131.8, బుచ్చయ్యపేట 124.2, నర్సీపట్నం 110.4, పరవాడ 107.8, ఎలమంచిలి 103.8 మాకవరపాలెం 96.4, గోలుగొండ 93.6, పాయకరావుపేట 78.8, కోటవురట్ల 70.2, రాంబిల్లి 64.6, నాతవరం 62.2, నక్కపల్లి 60.8, ఎస్ రాయవరం 57.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

బుచ్చయ్యపేట : గత మూడు రోజుల గా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వడ్డాది, బుచ్చయ్యపేటలలో తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో భారీగా నీరు చేరింది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు బుచ్చియ్యపేటలో 124.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. బుచ్చయ్యపేట కేబి రోడ్డు, వడ్డాది జంక్షన్ ఫిష్ మార్కెట్, మసీదు జలమయమయ్యాయి. చోడవరం రోడ్డులో తాచేరు నది సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. భారీ వర్షాలతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

దేవరాపల్లి : మండలంలోని రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, వాగులు పొంగిపొర్లుతుండటంతో వరద నీరు పంట పొలాల్లోకి చేరింది. పలుచోట్ల పంట పొలాలు మునిగి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఆందోళనలు చెందుతున్నారు. మరికొన్ని రోజులపాటు వర్షాలు కొనసాగితే పంటలన్నీ పూర్తిగా నష్టమయ్యే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

కశింకోట : ఎడతెరిపి లేని వర్షం కారణంగా కసింకోట మండలం తాళ్లపాలెం వారపు సంత సోమవారం వెలవెల పోయింది. ప్రతి ప్రతి సోమవారం అమ్మకందారులు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో వస్తారు. వర్షం కారణంగా కొనుగోలుదారులు రాకపోవడంతో వెలవెలబోయింది. చిరు వ్యాపారులు వచ్చినప్పటికీ అమ్మకాలు సాగలేదు. కోళ్ల సంత పూర్తిగా జరగలేదు. వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వర్షంతో జనం లేక వెలవెలబోయిన తాళ్లపాలెం సంత

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే, అధికారుల పర్యటన



పొంగి ప్రవహిస్తున్న ఏటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-చోడవరం : రెండు రోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చోడవరం పట్టణంలో ముంపునకు గురైన బాలాజీ నగర్, బాలయ్య కోనేరు, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం పరిశీలించారు. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపుకు గురైన వారిని పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు చేపడతామన్నారు. నీటి నిల్వ లేకుండా కాలువల ద్వారా బయటకు పంపే ప్రయత్నం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శాంతారావు, పంచాయతీ ఈఓ కే శ్రీనివాసరావు మల్లు నాయుడు, పెదబాబు సక్కురు కోటేశ్వరరావు ఎర్రం శెట్టి చిన్న టి శ్రీను, గోవింద్, గనేమల హరి పాల్గొన్నారు.

వడ్డాది : భారీ వర్షాలకు దెబ్బతిన్న బిఎన్ రోడ్డు, కాజ్‌వేలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఆర్ అండ్ బి అధికారులతో కలిసి విజయరామరాజుపేట తాచేరు కాజ్వేను, వడ్డాది పెద్దేరు వంతెనను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అక్కడినుండే ఏపీఆర్డీసీ ఎండితో మాట్లాడి పరిస్థితిని వివరించారు. బిఎన్ రోడ్డు పూర్తిస్థాయి నిర్మాణ పనులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈ సాంబశివరావుని ఆదేశించారు. భారీ వర్షాలకు చోడవరం నియోజకవర్గంలో వేలాది ఎకరాల పంట నీటి ముంపులో ఉన్నాయని, రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అయితే రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు పంట నష్టం వివరాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని, ప్రభుత్వం నుండి పరిహారం మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సాంబశివరావు, ఏఈ సాయి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్థానిక కూటమి నేతలు దొండా సన్యాసిరావు, నరేష్, గిరిబాబు, శ్రీరామ్మూర్తి, కోరుకొండ సూరప్పారావు, సింగంపల్లి రమేష్,వీర్ల సురేష్, పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : భారీ వర్షాల నేపథ్యంలో మండల తహసీల్దార్ ఎం లక్ష్మి సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన చేశారు. వడ్డాది, విజయరామరాజు పేట పొలాల్లో మునిగిన వరి పంటను పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న విజయరామరాజుపేట కాజువేను, వడ్డాది కాజువేను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రవణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. మోహన్‌రావు సోమవారం మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మతో కలిసి తారువ, ఎం.అలమండ, కొత్తపెంట, పెదనందిపల్లి, చిననందిపల్లి, దేవరాపల్లి గ్రామాల్లో పర్యటించారు. పొలాల్లో చేరిన వరద నీటిని పరిశీలించిన అధికారి, రైతులకు పోలీసు సూచనలు చేశారు. నీరు ఎక్కువసేపు నిల్వ ఉండే పరిస్థితి రాకుండా ఉండేందుకు పొలాల్లో అక్కడక్కడా గట్లు తెగగొట్టి నీరు బయటకు వెళ్లేలా చూడాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 19 గ్రామాలకు చెందిన 270 ఎకరాల వరి పంట పొలాల్లో నీరు నిలిచిపోయినట్టు గుర్తించామని చెప్పారు. తారువలోని చేపల చెరువులను పరిశీలించారు. చేపల చెరువుల్లో యూరియా వాడుతున్నారా అనే అంశంపై తనిఖీ చేశారు. దేవరాపల్లిలోని శ్రీ వెంకట నాగ చైతన్య రైతు డిపోను సందర్శించి, యూరియా ఎరువుల నిల్వలపై సమగ్ర సమాచారం సేకరించారు. రైతులు అప్రమత్తంగా ఉండి, వర్షాల ప్రభావం వల్ల పంటలకు ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



విజయరామరాజు పేట కాజ్‌వేను పరిశీలిస్తున్న తహశీల్దారు లక్ష్మి

అచ్యుతాపురం : తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు సత్యనారాయణ సూచించారు. మండలంలో తిమ్మరాజుపేట పెదపాడు గ్రామాలలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పంట పొలాల గురించి నీటి ముంపు గురించి అడిగి తెలుసుకున్నారు. తిమ్మరాజుపేట గ్రామంలో చెట్లు నరికివేతపై ఆయన విచారించారు. ఈ పర్యటనలో సరగడం శివ బాబు నాయుడు, బీసెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : తుఫాన్ ప్రభావం కారణంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు తీర ప్రాంత గ్రామాల్లో సోమవారం తహసిల్దార్ నరసింహ మూర్తి, ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తదితర అధికారులు పర్యటించారు. మండలంలో తీర ప్రాంత గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు, చందనాడ గ్రామాల్లో పర్యటించి, తుఫాన్ షెల్టర్ భవనాలను పరిశీలించారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. వర్షం ఎక్కువ పడితే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటర్ ట్యాంకుల్లో క్లోరోనేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఉపమాక, ఎన్ నరసాపురం గ్రామాల్లో కూడా పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.

కె.కోటపాడు : నియోజకవర్గంలోని మాడుగుల పెద్దేరు రిజర్వాయరు, చీడికాడ కోణాం రిజర్వాయర్, దేవరపల్లి రైవాడ రిజర్వాయర్‌లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్న నేపథ్యంలో రిజర్వాయర్లు నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరడంతో ఏ సమయంలోనైనా గేట్లు ఎత్తే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నాలుగు మండలాల ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎప్పుడు అప్పుడు వర్షం తీవ్రతను గమనిస్తూ ఎటువంటి నష్టం కలక్కుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల వలన మునిగిపోయి వరి పంట దెబ్బతిన్న నేపథ్యంలో, వ్యవసాయ సిబ్బంది వెంటనే నష్టాల వివరాలను సేకరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

రిజర్వాయర్లకు జలకళ

- రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు

- భారీగా పెరుగుతున్న నీటి మట్టాలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్లలో భారీగా నీరు చేరుతుంది. పెరిగిన నీటి మట్టాలతో ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. దీంతో రాబోయే వ్యవసాయ సీజన్‌కు మేలు జరిగే అవకాశాలు ఉన్నాయని రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. జిల్లాలో 5 ప్రధాన రిజర్వాయర్లలో 7,456 క్యూసెక్కుల నీరు నిల్వ ఉన్నట్లు అధికార లెక్కలు. తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరగ్గా వరాహ రిజర్వాయర్‌లో ఓ మోస్తారు మాత్రమే నీరు చేరింది. తాండవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3,493.60ఎంసి అడుగుల నీరు నిల్వ చేరింది. 1,641 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా, మొత్తం వర్షపాతం 46 మిల్లీమీటర్లు నమోదైంది. రైవాడ రిజర్వాయర్‌లో 2,743 ఎంసి అడుగుల నీరు నిల్వగా ఉంది. 287 క్యూసెక్కుల వరదప్రవాహం చేరుకుంది. ఈ రిజర్వాయర్ పరిధిలో 112 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోనాం రిజర్వాయర్‌లో ప్రస్తుతం 680 ఎంసి అడుగుల నీరు నిల్వ చేరింది. 200 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరింది. ఈ ప్రాంతంలో 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరాహ రిజర్వాయర్‌లో మాత్రం నీటి నిల్వలు ఇంకా తక్కువగానే ఉన్నాయి. ప్రస్తుతం 279 ఎంసి అడుగుల నీరు నిల్వగా ఉంది. వర్షపాతం కేవలం 14 మిల్లీమీటర్లు మాత్రమే నమోదు కావడంతో పెద్దగా నిల్వలు చేరలేదు. తెన్నేటి విశ్వనాథం పెద్దేరు రిజర్వాయర్‌లో 260 ఎంసి అడుగుల నీరు నిల్వగా ఉంది. ఇక్కడి నుండి 500 క్యూసెక్కుల వరదనీరు విడుదల చేశారు. ఈ పరిధిలో వర్షపాతం 144 మిల్లీమీటర్లు నమోదు అయింది. ఇంకా వర్ష ప్రభావం ఉండటంతో నీటి నిల్వలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

దేవరాపల్లి : మండలంలోని రైవాడ రిజర్వాయర్, మాడుగుల మండలంలోని తెన్నేటి విశ్వనాథం పెద్దేరు రిజర్వాయర్, చీడికాడ మండలంలోని వేచలపు పాలవెల్లి కోనాం రిజర్వాయర్లలో వరద నీరు పెద్ద ఎత్తున చేరుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం జలాశయంలో 113,00 మీటర్ల నీటిమట్టం నమోదు కావడంతో, 113,50,కి చేరితే గేట్లు ద్వారా మీరు విడుదల చేస్తామని జలాశయ చైర్మన్ పోతల పాతిరినాయుడు విలేకరులకు తెలిపారు.

గొలుగొండ : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన దారమఠం జలపాతం పరవళ్లు తొక్కుతుంది. తుపాన్ కారణంగా గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు జలపాతంలోకి వస్తుంది. దీంతో జలపాతం పరవళ్లు తొక్కడంతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది.

చీడికాడ : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న పాలవెల్లి జలాశయంలోకి వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి నీరును విడుదల చేసే అవకాశం ఉందని మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. రైతులు, ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్ సిబ్బంది వర్షం తీవ్రతను గమనిస్తూ ఎటువంటి ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దెబ్బతిన్న వరి పంటలను కాపాడుకోవడానికి ఏమైనా ప్రత్యామ్నాయాలు ఉంటే రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ఫొటో విడుదల అవుతున్న నీరు

మాడుగుల : మండలంలోని జాలంపల్లి శివారు రాయిపాలెం వద్దనున్న తేన్నేటి విశ్వనాథం(పెద్దేరు) జలాశయం సాధారణ నీటిమట్టం 137 మీటర్లు. సోమవారం ఉదయం నుండి కురిసిన వర్షానికి ప్రస్తుత నీటిమట్టం 135.90 మీటర్లకు చేరుకోవడంతో నాల్గవ గేటు నుండి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



నిండుకుండలా ఉన్న రైవాడ రిజర్వాయర్

1 నుండి నూతన బార్ పాలసీ

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి ప్రభుత్వం 2025-28 సంవత్సరాలకు గాను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి నూతన బార్ పాలసీ తీసుకువచ్చినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ వెల్లడించారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్లు వేలం పద్ధతి కాకుండా లాటరీ పద్ధతిలో కేటాయించడం జరుగుతుందన్నారు. జనాభా స్లాబ్‌ను బట్టి దరఖాస్తు రుసుము రూ.ఐదు లక్షలు, రూ.ఏడున్నర లక్షలు, రూ.10 లక్షలగా నిర్ణయించడం జరిగిందన్నారు. అన్ని బార్లకు రూ.5 లక్షల యాకరీతి ప్లాట్ అప్లికేషన్ ఫీజుతో పాటు పదివేల రూపాయల ప్రాసెసింగ్ ఫీజు ఉంటుందని చెప్పారు. రిటైల్ షాప్ లైసెన్స్ ఫీజు పర్మిట్ రూము ఫీజులతో సహా 50,000 జనాభా దాటి ఉంటే రూ.65 లక్షల 50 వేలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా వరకు రూ.79 లక్షలు, ఐదు లక్షల జనాభా పైన 101 లక్షలు ఉండగా, కొత్త బారు విధానంలో 50,000 జనాభాకు రూ.35 లక్షలు, 5 లక్షల జనాభాకు రూ.55 లక్షలు, ఐదు లక్షల జనాభా మించితే రూ.75 లక్షలు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. గతంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఉండగా ప్రస్తుతం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సమయం పెంచినట్లు తెలిపారు. గతంలో మొత్తం లైసెన్స్ రుసుమును ఒకే వాయిదాలలో ముందు గానే చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ విధానాన్ని మార్చి 6 సమాన వాయిదాలలో చెల్లించేలా, అందులో ఒక వాయిదాకు బ్యాంకు గ్యారంటీతో చెల్లించేలా వెసులుబాటు కల్పించడం జరిగిందని చెప్పారు. కొనుగోలు సమయంలో అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్ను చెల్లించాల్సి ఉండేదని, కొత్తవిధానంలో అదే ధరకు స్టాకును కొనుగోలు చేసి నిర్దిష్ట గడువు తేదీ నాటికి బ్యాంకు గ్యారంటీతో ఈ అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్ను చెల్లిస్తారని పేర్కొన్నారు. కొత్త విధానం ద్వారా బారు లైసెన్స్ పొందడానికి ముందుగా ఉన్న రెస్టారెంట్ తప్పనిసరి కాదన్నారు. లైసెన్స్ పొందిన 15 రోజుల్లోపు లైసెన్స్ దారులు రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న సుదీర్

ఘనంగా పీలా గోవింద జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, టిడిపి అనకాపల్లి నియోజవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పెంటకోట కన్వెన్షన్ కళ్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, విష్ణు కుమార్ రాజు, ఎమ్మెల్సీ దువ్వారాపు రామారావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, జనసేన నియోజకవర్గ ఇంచార్జీ భీమరశెట్టి రాంకీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపూరెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




పీలా గోవిందకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి అనిత

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ పాపం కూటమి ప్రభుత్వానిదే

ప్రజాశక్తి-దేవరాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పాపం కూటమి ప్రభుత్వానిదేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. విశాఖ ఉక్కులో 32 విభాగాలను ప్రైవేటుపరం చేస్తూ విశాఖ ఉక్కు ఆంధ్రులహక్కు అనే నినాదాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం సమాధి చేశారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇది చీకటి రోజని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా, నిరంకుశ వైఖరితో ఏక పక్షంగా నిర్ణయంతో విశాఖ ఉక్కులోని 32 విభాగాలను ప్రైవేట్‌పరం చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగంతో సాధించుకున్న విశాఖలోని 32 విభాగాల ప్రైవేటీకరణకు ఉక్కు యాజమాన్యం టెండర్లు విడుదల చేయడమంటే విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో చేసిన పోరాట స్ఫూర్తికి సమాధి కట్టడమే అవుతుందని పేర్కొన్నారు. ఆనాటి పోరాటంలో బిజెపి ఉండి ఉంటే ఆ పోరాటం విలువ ఏమిటో తెలిసి ఉండేదన్నారు. నాలుగేళ్లగా కార్మికులు పోరాటాల ద్వారా ప్రైవేటీకరణను అడ్డుకుంటూ రాగా, నేడు కూటమి ప్రభుత్వం పుణ్యమా అని విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగం నుండి చేజారి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి తలవొగ్గి రాష్ట్ర ప్రయోజనాలను రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీలు తాకట్టుపెట్టాయని విమర్శించారు.

పిఎసిఎస్‌ను అభివృద్ధి పథంలో నడపాలి

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక శ్రీదుర్గాంబ పిఎసిఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తూ రైతులకు రుణాలు అందుబాటులో ఉండేలా చేయాలని పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి అన్నారు. మండల కేంద్రంలోని జరిగిన శ్రీదుర్గాంబ పిఎసిఎస్ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి బాబ్జీ ముఖ్య అతిథిగా విచ్చేసారు. పిఎసిఎస్ చైర్మన్‌గా గండి దేముడు, డైరెక్టర్లుగా పల్లా తాతారావు, బొబ్బరి కన్నారావులచే సిఈఓ గొంప రమణ, ప్రత్యేక అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రంలోనే బెస్ట్ పిఎసిఎస్‌గా సబ్బవరం దుర్గాంబ పిఎసిఎస్‌కు ఇటీవల అవార్డు దక్కిందన్నారు. పిఎసిఎస్ నూతన అధ్యక్షుడు గండి దేముడు మాట్లాడుతూ పిఎసిఎస్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గండి ముత్యాల నాయుడు, నాయకులు గండి వంశీ దీప్, భరిణికాన సాయినాథరావు, బొండా సత్యారావు, పిబివిఎస్ఎన్ రాజు, రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు



బాధ్యతలు స్వీకరిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్‌ను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయాలసిస్, గర్భిణీ, డి-అడిక్షన్, అవుట్ పేషెంట్ విభాగలను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వాళ్లకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ విభాగం పనులను పరిశీలించి నిర్మాణ పనులు వేగవంతం చెయ్యాలని, ఆసుపత్రి ఆవరణలోని అన్ని విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రోగులకు అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ కృష్ణారావు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా టిడిపి కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, ఏపీ రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అచ్చుతాపురంలో సోమవారం ఎలమంచిలి నియోజకవర్గ ముఖ్యమైన కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. అక్రమాలకు పాల్పడే ప్రదేశాలలో అధికారులు నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కొలుకూలూరి విజయరామరాజు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, టిడిపి మండలాల అధ్యక్షులు పీలా తులసీరాం, లాలం భరత్, పెంటకోట విజయ్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లి నానాజీ, ఆడారి ఆదిమూర్తి, సేనాపతి నాగేశ్వరరావు, ఎరిపల్లి చిట్టిబాబు, కాండ్రేగుల అప్పారావు, లాలం రాజు, యాంద్ర అప్పలనాయుడు, లాలం అభిరామ్ పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన క్వారీ లారీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మార్టూరు వైపు నుంచి అనకాపల్లి ఆదివారం రాత్రి వస్తున్న భారీ క్వారీ లారీ తుమ్మపాల ఆంజనేయస్వామి ఆలయం వద్ద డివైడర్ పైనుంచి దూసుకుపోయింది. కాస్తలో విద్యుత్ వైర్లు అంటుకొని తెగి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అతిపెద్ద క్వారీ లారీ స్థానిక అండర్ బ్రిడ్జి వద్ద ఢీ కొట్టడం, ట్రైన్ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పడం తెలిసిందే. రోజుకు సుమారు 1000 భారీ క్వారీ వాహనాలు పరిమితికి మించి లోడుతో నిరంతరం రాకపోకలు సాగించడం పరిపాటిగా మారింది. పెద్ద పెద్ద బండ రాళ్ల వాహన పరిమితికి మించి వెళుతున్న ఇటు మైనింగ్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాల్లేవు. వారి నిర్లక్ష్యానికి కారణం ప్రతినెలా వారికి చేరుతున్న మామూళ్లేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నా కనీసం చీమకుట్టినట్టైనా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం వారికి పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్‌తో డైట్ అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాల ప్రముఖ ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థతో సోమవారం అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ సహకారంతో ఇంక్యుబేషన్ సెంటర్‌ను స్థాపిస్తామని, విద్యార్థుల స్టార్ట్ అప్స్ కోసం తగిన సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఈ ఇంక్యుబేషన్ సెంటర్లో 25 లక్షల విలువైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తామని కళాశాల విద్యార్థులే కాకుండా ఇతర పరిశోధకులు వారి పరిశోధనలను ఇందులో కొనసాగించవచ్చునని పేర్కొన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం సత్యప్రసాద్ మాట్లాడుతూ డైట్ విద్యార్థులకు బిఎస్‌ఎన్‌ఎల్ శిక్షణ సంస్థలో నూతన సాంకేతిక అంశాలలో శిక్షణను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలను చేయడానికి ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా డైట్ కళాశాలలో శాస్త్ర సాంకేతిక రంగాలలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ నుండి ఎస్‌డిఓ, డిడిఓ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఫణి బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీధర్, కోఆర్డినేటర్ కష్ణ నాగు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి భవనాలను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. రూ.31 లక్షలతో నిర్మించిన ఈ భవనాలతో పాటు 1979-80 బ్యాచ్‌కి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు బి. శివప్రసాద్, బోజంకి వెంకటరమణ, సింగంపల్లి వరప్రసాద్, యామాద్రి పోలీసు, కేవీ రమణమూర్తి తదితరులు రూ.1.20 లక్షలతో నిర్మించిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బొడ్డు అక్కు నాయుడు ఎంపీటీసీ సభ్యులు గౌతమి శంకరరావు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కే సింహాచలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆళ్ల శేఖర్, సమగ్ర శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

వరి నారు మడుల పరిశీలన

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి మండలం, పంచదార్ల గ్రామంలో వరి నారుమడులను ఎలమంచిలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జాహ్నవి సోమవారం పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. వరి పంటకు అవసరమయ్యే యూరియా, డిఎపి, పొటాషియం ఎరువులను గ్రామ స్థాయిలో అంచనా వేసి పంపించడం జరిగిందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఈ నెల 20వ తేదీ వరకు రైతుల నుండి గ్రీవెన్స్ తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సి.సుమంత తెలియజేశారు.

ఆదిత్య హోమియో క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఆదిత్య హోమియో క్లినిక్‌ను సోమవారం 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయసులోనే డాక్టర్ స్వప్నిక ఆసుపత్రి ప్రారంభించి వైద్య సేవలు అందించడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. పేదలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి వార్డ్ ఇంచార్జ్ మందుపాటి జానకి రామరాజు, న్యాయవాదులు గంగాధర్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఆటో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆటో దగ్ధమైన సంఘటనలో సోమవారం మండల కేంద్రం దేవరాపల్లిలో చోటుచేసుకుంది. దీంతో ఆ ఆటో డ్రైవర్ కుటుంబ జీవనాధారం ప్రశ్నార్థకమైంది. ఆటో నడిపి కుటుంబాన్ని పోషించుకుంటున్న అల్లు వెంకటరమణకు చెందిన ఆటోలోని బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆటో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో, వారు వచ్చే లోపల ఆటో పూర్తిగా కాలిపోయింది. క్షణాల్లోనే తన జీవనాధారం కళ్లముందే కరిగిపోవడాన్ని ఆయన భరించలేక విలపించాడు. ఈ ఘటనలో రూ.1.50 లక్షలు ఆర్థిక నష్టం కలిగిందని బాధితుడు వాపోయాడు. తమను ఆదుకోవాలని కోరాడు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సిఫార్సు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ ఖాతా నుండి అనకాపల్లి నియోజవర్గంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో అందజేశారు. దళసరి రమణమ్మకు రూ.73,122, పుర్రె తులసికి రూ.2,60,018, పిన్నింటి వరలక్ష్మికి రూ.20 వేలు, ఎలంకాయల అర్జున్ కుమారికి రూ.20 వేలు, కోరుకొండ గోవిందమ్మకు రూ.40 వేలు, పిల్లల సంతోష్‌కు రూ.58,347, దూలం లోవరాజుకు రూ.35,350, నిమ్మల బాబురావుకు రూ.20 వేలు, బంటు నాగరాజుకు రూ.99,157, ద్వారపురెడ్డి జగ్గయ్యమ్మ రూ.57,939, గుమ్మడి రాజుకు రూ.48,414, గొర్లి రమణకు రూ.75 వేలు మంజూరయ్యాయి. జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) చేతుల మీదగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, గొంతిన శ్రీనివాసరావు, దూలం గోపి, మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశి నాయుడు పాల్గొన్నారు.

పూడిక తీసి గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పాత పోలీస్ స్టేషన్ రోడ్డు వద్ద మూడు నెలలుగా రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు కు అడ్డంగా ఉన్న పూడికతీతను సోమవారం జెసిబితో తీయించారు. వర్షపు నీరు పోయే విధంగా ఏర్పాట్లు చేశారు. స్థానిక తహసిల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో బానోజీరావు, సర్పంచ్ సుంకర లక్ష్మి వర్షపు నీరు నిలిచిపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. జెసిబిని తీసుకొచ్చి సమీపంలో ఇరువైపులా గల షాపుల వద్ద గల మట్టిని తవ్వించారు. రోడ్డుపై పడిన గొంతులో పిక్క బూడిదతో కూడిన మిశ్రమాన్ని వేయించి గుంతలను పూడ్చారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

తాడివలస గెడ్డలో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని శంకరం పంచాయతీ తాడివలస, గోప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కోత్తవలస, మామిడిపాలెం గిరిజన గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించాలని, కోత్తవలస, తాడివలస, మామిడిపాలెం గెడ్డలపై మూడు బ్రిడ్జిలు నిర్మించాలని ఏడు గ్రామాలకు చేందిన ఆదివాసీ గిరిజనులు తాడివలస గెడ్డలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి. మాట్లాడుతూ, మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు గిరిజన గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయని, ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పిస్తామని నమ్మబలికిన నాయకులు సంవత్సరం అవుతున్నా కనీసం పట్టించుకోలెదన్నారు. వర్షం వస్తే గెడ్డలు దాట లేక గర్భిస్త్రీలు, బాలింతలను డోలిలు కట్టి మోసుకు వస్తున్నారని తెలిపారు. పిల్లలు స్కూలుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోట్టివాడ నుండి కోత్తవలస వెలగలపాడు, గోప్పువూరు, తాడి వలస మీదుగా రాయిపాలెం, రాజం పేట మీదుగా క్రిష్ణంపాలెం వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే వందలాది మంది గిరిజనులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తాడివలస గెడ్డ దాటలేక గర్భిణీ ఆ ప్రాంతంలోనే ప్రసవించిందని తెలిపారు. వర్షకాలం వస్తే గెడ్డలు దాటలెక, రోడ్లు సౌకర్యాలు లేక 108 ,104 వంటి సౌకర్యాలు పూర్తిగా ఉండటం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని గిరిజనులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి సన్యాసమ్మ, సోమల నరసింహమూర్తి, సాగరి. ఈశ్వరరావు, సోలం. చంద్రశేఖర్, అధిక సంఖ్యలో గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.



గెడ్డ అవతల నిరసన చేపడుతున్న గిరిజనులు

ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు కృషి

-హోం మంత్రి అనిత
-వైద్య పరికరాలు ప్రారంభం



రోగులతో మాట్లాడుతున్న మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో సోమవారం రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన పలు వైద్య పరికరాలను ఆమె ప్రారంభించారు. రోగుల వార్డులను పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రూ.17 లక్షల 50 వ్యయంతో ఎక్స్ రే ప్లాంట్, 18 లక్షల 50 వేల వ్యయంతో సి- ఆర్మ్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డెక్కన్ కెమికల్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులతో 10 లక్షల 50 వేల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్, హెటిరో డ్రగ్స్ కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో 12 లక్షల 20 వేల రూపాయల విలువైన వైద్య పరికరాలు,7 లక్షల వ్యయంతో ఆసుపత్రి పెయింటింగ్ వర్క్స్ చేయడం జరిగిందని తెలిపారు. సుమారుగా 65 లక్షల 70 వేల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉందని, తరచూ రోడ్డు ప్రమాద కేసులు ఎక్కువ నమోదయ్యే పరిస్థితి ఉందన్నారు. నక్కపల్లి ఆసుపత్రిలో ప్రస్తుతం రోజుకు 450 నుండి 500 వరకు ఓపి ఉందని, రోగులు తాకిడి పెరిగిందన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులు హెూంమంత్రి అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ శిరీష, ఎంపీడీవో సీతారామరాజు, హెటిరో కంపెనీ ప్రతినిధులు కుల్లాయి రెడ్డి, ఎంఎన్‌వీఎస్ రెడ్డి, రాజారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కెజిబివిలో అభివృద్ధి పనులు ప్రారంభం

నక్కపల్లి: నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ గదులను రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదగా సోమవారం ప్రారంభించారు. విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. ఆర్వో ప్లాంట్ తరచూ మరమత్తుపై కేజీబీవీ ప్రత్యేక అధికారి షేక్ సలీమా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. క్రాఫ్ట్, కంప్యూటర్ ఉద్యోగులకు జీతలు పెంచుతూ గతంలో ఇచ్చిన జీవోను అమలు చేయాలని సంబంధిత ఉద్యోగులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి సీతారామరాజు, జిసిడిఓ జెమిమా, ఎంఈఓ నరేష్, ఎస్ఎంసి చైర్మన్ పిక్కి పోలేరు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గొడిచెర్ల పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ పాల్గొన్నారు.

జోరు వానలోనూ నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ రద్దు చేయాలని సోమవారం జోరు వానలో తడుస్తూ దళిత రైతులు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, క్వారీ రద్దు చేయాలంటూ 27 రోజుల నుంచి నిరసన తెలియజేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ క్వారీ రద్దు చేసి, మైనింగ్ మాఫియా ఆగడాల నుంచి తమకు రక్షణ కల్పించాలన్నారు. క్వారీ రద్దు అయ్యే వరకు ఇక్కడ నుంచి కదిలేదే లేదని తేల్చి చెప్పారు.నిరసన దీక్ష కు మద్దతుగా ఆల్ ఇండియా బిఎస్‌పి పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు, సిపిఎం నాయకులు చిరంజీవి పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, పెంటయ్య, సత్తిబాబు, గణేష్, లావరాజు, కళ్యాణం, నాగభూషణం, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రైతులు

న్యాయం చేసే వరకు భూముల జోలికి రావొద్దు

- నిర్వాసితుల ఆందోళన



నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి: న్యాయం చేసే వరకు భూముల జోలికి రావద్దని భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. మండలంలో చందనాడ పంచాయతీ తమ్మయ్యపేట, తుమ్మలపేట గ్రామాలకు చెందిన కారిడార్ నిర్వాసితులు సోమవారం నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డిఓ వీవి రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు, గృహాలకు, చెట్లు, బావులు, బోర్లకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించాలని, అర్హులందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించకుండానే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితుల నుండి ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లు సేకరించడం పై మండిపడ్డారు. సాగు భూములకు, చెట్లు, గృహాలు, బావులు, బోర్లకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించాలన్నారు. ఆర్ కార్డులు ఇవ్వాలని, స్థాపించబోయే పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు భూముల జోలికి రావద్దని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు రోకళ్ళ గోవింద్, సూరకాసుల శ్రీను, మంతిన నాగేశ్వరరావు, రోకళ్ళ పద్మ పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్. నాగాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేశానన్నారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. పాఠశాలలో సర్పంచ్ లేకుండానే కార్యక్రమం జరిపించడంతో పాటు మాజీ సర్పంచ్‌తో జెండా ఆవిష్కరణ చేయించారని తెలిపారు.స్కూల్ చైర్మన్‌ను సైతం పక్కకు పెట్టి గ్రామ మాజీ సర్పంచ్‌తో జెండా ఆవిష్కరణ చేయించారన్నారు. ప్రస్తుత సర్పంచ్‌గా ఉన్న తాను లేకుండా వేడుకలు నిర్వహించడమేంటని ప్రశ్నించారు.



విద్యార్థులతో విజయ్ ప్రకాష్

ఘనంగా శ్రీ ప్రకాష్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - పాయకరావుపేట: పట్టణంలోని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ 49వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమ య్యాయి. విద్యార్థుల్లో ఔత్సాహిక గాయనీ, గాయకులను వెలికితీయాలన్న లక్ష్యంతో గాతా రహే మేరా దిల్ కార్యక్రమం ప్రతీ ఏటా నిర్వహిస్తున్నామని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ అన్నారు. మధురమైన పాటలను ఆస్వాదించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా విచ్చేసిన ప్రముఖ కీ బోర్డ్, హార్మోనియం వాయిద్యకారులు దుర్గా ప్రసాద్, దూరదర్శన్ గాయకురాలు ఆర్ సునీత మాట్లాడుతూ... నేటి పోటి ప్రపంచంలో కొంతమంది తల్లిదండ్రులు కేవలం చదువులకి మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ విద్యాసంస్థల పయనంలో అనేకమంది మేధావులను, ఉన్నతాధికారులను సమాజానికి అందించిందన్నారు. పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, వివిఎస్ఎస్ భానుమూర్తి, బంగార్రాజు, రామకృష్ణారెడ్డి, సీతారాణి, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.40 వేల ఆర్థిక సాయం

-మానవత్వం చాటుకున్న చిన్ననాటి స్నేహితులు

ప్రజాశక్తి-గొలుగొండ: తమతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు కృష్ణ దేవి పేట గ్రామానికి చెందిన పైల అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణిం చడంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని స్నేహితులందరూ సంక ల్పించారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో 1994-95 సంవత్సరంలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు అందరూ కలిసి రూ.40వేలను సమకూర్చి పైలా అప్పలనాయుడు భార్య దేవి, కుమార్తెకు సోమవారం అందజేశారు. మరో 10 వేల రూపాయలు విలువైన వెండి వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి పాఠశాల స్టూడెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ మీరా సాహెబ్, దొరబాబు, మాకిరెడ్డి శ్రీరామ్మూర్తి, తంగేటి లవకుశ, సుర్ల వెంకటరావు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

సేంద్రియ సాగుకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-గొలుగొండ: రైతులంతా రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో జీవనోపాదుల సేవా కేంద్రాన్ని చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయాన్ని రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో తేవడానికి ప్రభుత్వం జీవనోపాదులు సేవా కేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలోపశు వైద్యాధికారి దుర్గాప్రసాద్, వెలుగు ఏపిఎం కరుణానిధి, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, చోద్యం పిఎసిఎస్ డైరెక్టర్ రేగుబల్ల శివ, విప్పలపాలెం నీటి సంఘం చైర్మన్ గొర్లి సత్యనారాయణ, రైతు మిత్ర సంఘాల అధ్యక్షులు బొడ్డు రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని చోద్యం పిఎసిఎస్ చైర్మన్‌గా కొత్త మల్లంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిటికెల సాంబమూర్తి, డైరెక్టర్‌లుగా జి.కొత్తూరు గ్రామంకు చెందిన కొరుప్రోలు నూకరాజు, సీహెచ్.నాగాపురం గ్రామంకు చెందిన జనసేన పార్టీ నాయకులు రేగుపల్లి శివ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, చోద్యం సర్పంచ్ గోపాలకృష్ణ, కొత్త ఎల్లవరం సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి -నక్కపల్లి: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలో నెల్లిపూడి గ్రామంలో ఆదివారం రాత్రి పర్యటించారు. చేనేత కార్మికుడు కొల్లి శ్రీనివాసరావు నివాసంలో మగ్గాన్ని పరిశీలించి, రాట్నంతో నూలు వడికారు. చేనేత కార్మికులతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత విద్యుత్తును 100 యూనిట్ల నుండి 200 యూనిట్లకు పెంచడం జరిగిందని, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు 4 వేలు రూపాయలు ఫించన్ ఇస్తున్నామన్నారు. 2 ఉప్పాడ పట్టు చీరలు కొనుగోలు చేశారు. నెల్లిపూడి సర్పంచ్ కొలుకులూరి సురేష్ వర్మ తన అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. హోం మంత్రి అనిత వారందరికీ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.